
సాక్షి ఆదిలాబాద్

శనివారం । 20 । జనవరి । 2024

ఆహా రామా.. అయోధ్య రామా..



ఐదు శతాబ్దాల అపురూప స్వప్నం సాకారమవుతోంది. అయోధ్యలో శ్రీరామ విగ్రహ ప్రాణప్రతిష్ఠ మహోత్సవానికి ఉమ్మడి జిల్లా నుంచి పలువురికి ఆహ్వానాలందాయి. 8లో▸



మూడో రోజు అదే జోరు..

ఉట్నూర్‌లోని కేబీ ప్రాంగణంలో ఐఎస్ఎల్ క్రీడా పోటీలు కొనసాగుతున్నాయి. క్రీడాకారులు మూడోరోజు అదే జోరు కొనసాగించారు. 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
30.0 /18.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమశాతం పెరగనుంది. రాత్రి వేళలో చలి ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

24న చిత్రలేఖనం పోటీలు

ఆదిలాబాద్‌టౌన్: జాతీయ బాలికా దినోత్సవం పురస్కరించుకొని పాఠశాలల్లో ఈనెల 24న చిత్రలేఖన, క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా మహిళాభివృద్ధి శిశు సంక్షేమశాఖ అధికారి కె .మిల్కా ప్రకటనలో తెలిపారు. బాలికా దినోత్సవం నేపథ్యంలో ఆయా పాఠశాలల్లో శనివారం నుంచి ఈ నెల 24 వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. సమాజంలో బాలికల సంరక్షణ, హక్కులు, ఆరోగ్యం, విద్య, సామాజిక ఎదుగుదల మొదలైన అంశాలపై అవగాహన కల్పించేలా ఈ పోటీలు ఉంటాయని తెలిపారు.

వేతనాలు చెల్లించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కైలాస్‌నగర్: మున్సిపల్ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లింపుతోపాటు, ఇతర సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు. ఈమేరకు మున్సిపల్ కమిషనర్ శైలజను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. కార్మికులకు ప్రతినెలా ఇవాల్సిన బెల్లం, కొబ్బరినూనె, గ్లౌజ్‌లు, షూ, యూనిఫాంతో పాటు అన్ని రకాల వస్తువులు అందించాలన్నారు. అలాగే ప్రతి నెల 5వ తేదీ లోపు వేతనాలు ఇప్పించేలా ప్రభుత్వానికి లేఖ రాసి కార్మికులను ఆదుకోవాలని కోరారు. లేని పక్షంలో కార్మికులకు మద్దతుగా సంఘపక్షాన ఆందోళనలు చేపడుతామన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు జి.రాజు, దేవేందర్ తదితరులున్నారు.

22న సెలవు ప్రకటించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కైలాస్‌నగర్: అయోధ్యలోని రామాలయంలో శ్రీరామ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం దృష్ట్యా ఈ నెల 22న జిల్లాలో సెలవు ప్రకటించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నాయ కులు కోరారు. ఈమేరకు కలెక్టర్ రాహుల్ రాజ్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అలాగే సంఘం డైరీని అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సునీల్ చౌహాన్, వల్లబోజు గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేలైన్ సాధనకు ముందుకు రావాలి



సంఘీభావం ప్రకటిస్తున్న సుహాసినిరెడ్డి

ఆదిలాబాద్: ఆదిలాబాద్–ఆర్మూర్ రైల్వేలైన్ సాధన కోసం రాజకీయాలకతీతంగా ప్రజా ప్రతినిధులు ముందుకు రావాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసిని రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ విశ్రాంత భవనం వద్ద ఆదిలాబాద్–ఆర్మూర్ రైల్వేలైన్ సాధన కోసం చేపట్టిన రిలే దీక్ష శిబిరాన్ని శుక్రవారం ఆమె సందర్శించి సంఘీభావం ప్రకటించారు. ఆదిలాబాద్ జిల్లా ప్రజల చిరకాల వాంఛ అయిన రైల్వేలైన్ సమస్యను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. అనంతరం రైల్వేలైన్ సాధన కమిటీ సభ్యులు బస్టాండ్ ఎదుట నిరసన చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు దేవేందర్ తదితరులున్నారు.

నిధులు మంజూరు చేయాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న జెడ్పీటీసీ గణేశ్‌రెడ్డి

తలమడుగు: మండలంలోని సుంకిడి పాఠశాల భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని స్థానిక జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి కోరారు. ఈమేరకు హైదరాబాద్‌లో పాఠశాల విద్యా కమిషనర్ శ్రీదేవసేనను శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట బజార్‌హత్నూర్ జెడ్పీటీసీ నర్సయ్య ఉన్నారు. అలాగే సెక్రెటేరియట్‌లో సీఎం ప్రత్యేక కార్యదర్శి గోపిడి చంద్రశేఖర్ రెడ్డిని కలిశారు.

పీఠ ముడి!



- బీజేపీ నూతన జిల్లా అధ్యక్షుడి ఎంపిక వాయిదా
- ఎమ్మెల్యే శంకర్ అనుయాయులకు ఇచ్చేలా యత్నాలు
- మరోవైపు సుహాసినిరెడ్డి తీవ్ర ప్రయత్నాలు
- ఎంపీ ఎన్నికల నేపథ్యంలో అధిష్టానం తర్జనభర్జన

సాక్షి,ఆదిలాబాద్: బీజేపీ నూతన జిల్లా అధ్యక్షుడి ఎంపికలో పీఠ ముడి నెలకొంది. ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ తన అనుయాయులకు ఇప్పించేలా ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు సీనియర్ నాయకురాలు జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి ఆ పదవి కోసం విస్తృత యత్నాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అధిష్ఠానం తర్జనభర్జనలో పడింది. గురువారం రాష్ట్రంలోని పలు జిల్లాల అధ్యక్షులను మారుస్తూ కేంద్ర మంత్రి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. ఆదిలాబాద్ జిల్లా విషయంలో ఎమ్మెల్యే ఒత్తిడి కారణంగా చివరి నిమిషంలో వాయిదా వేసినట్లు తెలుస్తోంది.

సంస్థాగత మార్పులు..

రాష్ట్ర బీజేపీలో సంస్థాగత మార్పులు చోటు చేసుకుంటున్నాయి. జిల్లాల అధ్యక్షులతో పాటు వివిధ మోర్చాల అధ్యక్షులను కూడా మార్చుతున్నారు. పాయల్ శంకర్ గతంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా కొన్ని నెలల పాటు వ్యవహరించారు. ఆ తర్వాత 2016లో జిల్లాల విభజన తర్వాత కొత్త ఆదిలాబాద్ జిల్లాకు అధ్యక్షుడిగానూ వ్యవహరిస్తూ వచ్చారు. శాసనసభ ఎన్నికలకు ముందు అప్పట్లో రాష్ట్ర అధ్యక్షుడిగా వ్యవహరించిన ఎంపీ బండి సంజయ్ జిల్లా అధ్యక్షులను మార్చాలనే ప్రయత్నాలు చేసినప్పటికీ వాయిదా వేశారు. తాజాగా కిషన్‌రెడ్డి సంస్థాగత మార్పులకు సిద్ధం అయ్యారు. అప్పట్లో ఆదిలాబాద్ అసెంబ్లీ టిక్కెట్ విషయంలో పాయల్ శంకర్, సుహాసినీరెడ్డి మధ్యపోరు నెలకొన్న విషయం తెలిసిందే. తాజాగా అధ్యక్ష పదవి తన అనుయాయులకు ఇప్పించాలని ఎమ్మెల్యే అధిష్టానం వద్ద ప్రయత్నాలు చేస్తున్నారు. మరో పక్క తనకు అవకాశం ఇవ్వాలని సుహాసినీరెడ్డి కోరుతోంది. ఈ నేపథ్యంలో పార్టీ నిర్ణయం ఎలా ఉంటుందనేది ఆసక్తికరమే.

పలువురి పేర్లు పరిశీలన..

పాయల్ శంకర్ రెండు పర్యాయాలు అధ్యక్షుడిగా వ్యవహరించిన దృష్ట్యా పార్టీ సిద్ధాంతం ప్రకారం మూడో మారు అవకాశం ఉండదని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అంతే కాకుండా ప్రస్తుతం ఎమ్మెల్యేగా వ్యవహరిస్తున్న ఆయన బీజేఎల్పీ పదవి కోసం కూడా ప్రయత్నిస్తున్నారు. ఇదిలా ఉంటే అసెంబ్లీ ఎన్నికల సమయంలో తనకు టికెట్ ఇవ్వనందున, ప్రస్తుతం జిల్లా అధ్యక్ష పదవి ఇవ్వాలని సుహాసినిరెడ్డి కోరుతున్నారు. ఇదిలా ఉంటే అధిష్టానం వద్ద నూతన జిల్లా అధ్యక్షుడి కోసం ఐదు పేర్లు పరిశీలనకు వచ్చినట్లు తెలుస్తోంది. సుహాసినిరెడ్డి, ఆదినాథ్, జ్యోతిరెడ్డి, సాకటి దశరథ్, పతంగే బ్రహ్మానంద్ ఉన్నారు. సుహాసినిరెడ్డి, ఆదినాథ్ పేర్లు మొదట పోటీలో ఉండగా, అధిష్టానం ఒకరి పేరును ఎంపిక చేయగా ఎమ్మెల్యే విభేదించినట్లు తెలుస్తోంది. సుహాసినిరెడ్డి విస్తృత ప్రయత్నాల నేపథ్యంలో పాయల్ శంకర్ మరో మహిళా నేత జ్యోతిరెడ్డి పేరును తెరపైకి తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. ఏదేమైనా బీజేపీలో మరోసారి నేతల మధ్య వార్ నెలకొంది.

పారదర్శకంగా ఓటరు జాబితా రూపకల్పన



వీసీలో పాల్గొన్న కలెక్టర్ రాహుల్‌రాజ్, అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి

- కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: పారదర్శకమైన ఓటరు జాబితా రూపకల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. ఓటరు జాబితా సవరణపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ శుక్రవారం హైదరాబాద్ నుంచి ఆయా జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో ఫొటో ఓటరు జాబితా కార్యక్రమాన్ని అధికారులు సమన్వయంతో చేపడుతున్నట్లు తెలిపారు. నూతన ఓటరు నమోదు, సవరణలు, తొలగింపుల కోసం 6, 7, 8 ఫారాల ద్వారా అందిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి వివరాలు నమోదు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తమ వివరాలు జాబితాలో నమోదు చేసుకునేలా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 20,21 తేదీలలో నూతన ఓటరు నమోదు కోసం అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మరణించిన, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి వివరాలు పరిశీలించి నిబంధనల మేరకు నోటీసులు జారీ చేసి తొలగింపునకు చర్యలు తీసుకుంటామన్నారు. ఓటరు జాబితా రూపకల్పనపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సర్వీసు ఓటర్ల నమోదుతో పాటు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల భద్రతకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. లోక్‌సభ ఎన్నికల విధులు కేటాయించేందుకు వీలుగా సిబ్బంది వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో స్రవంతి, తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులున్నారు.

గణతంత్ర వేడుకల్లో అంబేద్కర్ ఫొటో పెట్టాలి

కైలాస్‌నగర్: జిల్లాలో ఈ నెల 26న నిర్వహించనున్న గణతంత్ర వేడుకల్లో బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటాన్ని ఉంచాలని టీఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. వేడుకలు జరిగే ప్రభుత్వ కార్యాలయాలన్నింటిలో అంబేద్కర్ ఫొటోలు పెట్టేలా అధికారికంగా ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ శుక్రవారం ఆ సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో సంఘం జిల్లా అధ్యక్షుడు మల్యాల మనోజ్ కుమార్, అధికార ప్రతినిధి రాందాస్, నాయకులు తదితరులు ఉన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి విలాస్



మాట్లాడుతున్న విలాస్

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపల్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం వేకువజామున విధులకు హాజరైన కార్మికులతో మున్సిపల్ కార్యాలయం ఎదుట సమావేశం నిర్వహించారు. మున్సిపల్ కార్మికుల సంఘం ఇన్‌చార్జి కుంటాల రాములు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు పెండింగ్‌లో ఉన్న రెండు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే కార్మికుల ఖాతాల్లో పీఎఫ్ డబ్బులు జమయ్యేలా చూడాలన్నారు. కేంద్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు రూ.26వేల కనీస వేతనం, రూ.5వేల పెన్షన్ అందించాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్రా దేవేందర్ మాట్లాడుతూ, ఐక్యంగా ఉండి హక్కుల సాధన కోసం పోరాటం చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి కాంతారావు, రవి, చిన్నయ్య, దేవమ్మ, ఆశమ్మ, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్ఠాపన మహోత్సవం ఘనంగా నిర్వహించాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శంకర్, మఠాధిపతి యోగానంద సరస్వతి స్వామి

ఆదిలాబాద్: అయోధ్యలో ఈనెల 22న నిర్వహించనున్న బాలరాముని విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీ రామచంద్ర గోపాలకృష్ణ మఠాధిపతి యోగానంద సరస్వతిస్వామి అయోధ్య ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమానికి శుక్రవారం బయలుదేరిన నేపథ్యంలో ఆయనకు వీడ్కోలు పలికారు. మేళతాళాల నడుమ ఆయనను సాగనంపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతీ గ్రామంలో ఈనెల 22న ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధల నడుమ నిర్వహించుకోవాలని కోరారు. అలాగే జిల్లా కేంద్రంలో శ్రీరామనవమి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో భారీ శోభాయాత్ర ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, హిందూ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలి



వర్చువల్ పద్ధతిన విద్యార్థుల ప్రాజెక్టులను తిలకిస్తున్న డీఈవో ప్రణీత, అధికారులు

- డీఈవో ప్రణీత

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులు నూతన ఆవిష్కరణలు రూపొందించి భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని డీఈవో ప్రణీత అన్నారు. జిల్లాకేంద్రంలో ఆన్‌లైన్ ద్వారా శుక్రవారం సైన్స్‌ఫేర్ నిర్వహించారు. ఆరు అంశాలకు సంబంధించి వర్చువల్ పద్ధతిలో చేపట్టారు. 153 ప్రాజెక్టులను గూగుల్ ఫామ్ ద్వారా సమర్పించారు. వీటిలో ప్రతిభ కనబర్చిన 15 ప్రాజెక్టులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. ఇందులో ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలకు సంబంధించి 10, ఐటీడీఏ నుంచి 5పాఠశాలలు ఎంపికయ్యాయి. డీఈవో మాట్లాడుతూ,నిత్యజీవితంలో సైన్స్‌ప్రాధాన్యత ఎంతో ఉందన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులను మరింతగా ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి రఘురమణ,ఉదయ్‌రావు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

పదో తరగతిలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చే యాలని డీఈవో టి.ప్రణీత అన్నారు. పట్టణంలోని రాంనగర్ పాఠశాలను శుక్రవారం తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులతో మాటాడారు.

బడిలో ఎన్నికల గంట

- ఎస్ఎంసీ ఎన్నికల షెడ్యూల్ విడుదల
- ఈనెల 20 నుంచి ప్రక్రియ
- 29న విద్యా కమిటీ ఎన్నికలు
- నాలుగేళ్ల తర్వాత మోక్షం



ఆదిలాబాద్‌టౌన్: ఎట్టకేలకు సర్కారు బడుల్లో పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికల నగారా మోగింది. ఇది వరకు 2019 డిసెంబర్‌లో విద్య కమిటీలను ఎన్నుకోగా, ఆ తర్వాత నుంచి పదవీ కాలం పొడిగిస్తూ వచ్చారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎస్ఎంసీలకు మోక్షం లభించింది. పాఠశాల విద్యాశాఖ కమిషనర్, డైరెక్టర్ దేవసేన ఎస్ఎంసీ ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్‌ను గురువారం విడుదల చేశారు. ఈనెల 29న ఆయా పాఠశాలల్లో ఎన్నికల సందడి నెలకొననుంది. 1నుంచి 8వ తరగతుల పాఠశాలలకు మాత్రమే ఇవి జరగనున్నాయి. ప్రస్తుతం పాత కమిటీల్లో ఆ పాఠశాలల్లో చదవని విద్యార్థుల తల్లిదండ్రులు చైర్మన్‌గా కొనసాగుతున్నారు. వీరు పట్టించుకోకపోవడంతో విద్యావ్యవస్థ కొంత అస్తవ్యస్తంగా మారింది. ప్రస్తుత విద్యార్థుల తల్లిదండ్రులు ఈ కమిటీల్లో ఉన్నట్లయితే పాఠశాల బాగోగులతో పాటు విద్యార్థులు ఏవిధంగా విద్యను అభ్యసిస్తున్నారో తరచూ పర్యవేక్షించే అవకాశం ఉంటుంది.

షెడ్యూల్ విడుదల..

స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికల కోసం ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసింది. ఈ ప్రకారం జిల్లాలోని ప్రభుత్వ, జెడ్పీ, మోడల్ స్కూల్, కేజీబీవీలు, గురుకులాలకు కొత్త కమిటీలు ఏర్పడనున్నాయి. ప్రైవేట్ మినహా ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలన్నింటిలో ఈనెల 29న ఎన్నికలు కొనసాగనున్నాయి. ఈనెల 20న ఎస్ఎంసీకి సంబంధించి నోటిఫికేషన్ జారీ చేస్తారు. అలాగే విద్యార్థుల తల్లిదండ్రుల జాబితాను నోటీసు బోర్డుపై ప్రకటిస్తారు. 22న జాబితాల అభ్యంతరాలు స్వీకరిస్తారు. 24న పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రుల తుది జాబితా విడుదల చేస్తారు. 29న ఎన్నికలు నిర్వహిస్తారు. అయితే పాఠశాలల్లో ఒక్కో తరగతి నుంచి ముగ్గురు తల్లిదండ్రులను సభ్యులుగా ఎన్నుకుంటారు. ప్రాథమిక పాఠశాలల్లో 15 మంది, యూపీఎస్‌ల్లో 21 మంది, 1 నుంచి 8 తరగతులు ఉన్న పాఠశాలల్లో 24 మందిని ఎన్నుకుంటారు. ఎన్నుకున్న సభ్యులంతా కలిసి పాఠశాలలో ఒకరిని చైర్మన్‌గా, మరొకరిని వైస్ చైర్మన్‌గా ఎన్నుకుంటారు. ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ నిర్వహిస్తారు. ఆరుగురు ఎక్స్‌అఫీషియో, ఇద్దరు కోఆప్షన్ సభ్యులు ఉంటారు. తల్లి, తండ్రి, సంరక్షకుల్లో ఒకరు మాత్రమే ఓటరుగా ఉంటారు. సభ్యులను చేతులెత్తి ఎన్నుకోవడం, తప్పనిసరి పరిస్థితుల్లో రహస్య బ్యాలెట్ పద్ధతిలో ఓటింగ్ నిర్వహిస్తారు.

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు	
మొత్తం	1,223
ప్రాథమిక	914
యూపీఎస్	107
ఉన్నత	202

ఎస్ఎంసీ బాధ్యతలివి..

ఎస్ఎంసీలో విద్యార్థుల తల్లిదండ్రుల భాగస్వామ్యం కీలకంగా ఉంటుంది. ఇందులో ఎన్నికైన సభ్యులు పాఠశాలల్లో జరిగే కార్యక్రమాలో పాల్గొనవచ్చు. ఉపాధ్యాయులు సక్రమంగా విధులకు హాజరవుతున్నారా.. లేదా, సమయపాలన పాటిస్తున్నారా అనే వాటిని ఈ కమిటీ పర్యవేక్షించాలి. మధ్యాహ్న భోజన అమలు తీరు, పాఠ్య పుస్తకాల పంపిణీ, మన ఊరు– మనబడి పనుల పరిశీలన, మరుగుదొడ్లు, మూత్రశాలలు, పాఠశాలకు అవసరమైన మౌలిక వసతులు ఉన్నాయా.. లేదా అనేది పర్యవేక్షించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలి. అలాగే తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించడం, విద్యార్థుల ప్రగతిని పరిశీలించడం తదితర కార్యక్రమాలను నిర్వహించవచ్చు. అదేవిధంగా పాఠశాలకు ఏవైనా నిధులు మంజూరైతే తీర్మానం చేసి పనులు చేపట్టే అవకాశం ఉంటుంది. పాఠశాలల్లో కమిటీ సభ్యుల పిల్లల చదువు పూర్తయి ఇతర పాఠశాలల్లో చేరితే వారి తల్లిదండ్రులను ఈ కమిటీ నుంచి తొలగించాల్సి ఉంటుంది.

పకడ్బందీగా నిర్వహిస్తాం



ఎస్ఎంసీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహిస్తాం. ఈ మేరకు ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసింది. ఈనెల 20 నుంచి 29 వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుంది. ఎస్ఎంసీల ఎన్నికలు ఈనెల 29న ఉంటాయి. జిల్లాలో 1,223 పాఠశాలలు ఉన్నాయి. 1 నుంచి 8 తరగతులకు ఎన్నికలు నిర్వహిస్తాం.

– టి.ప్రణీత, డీఈవో

కొత్త పోస్టులు కేటాయించాలి

ఆదిలాబాద్‌టౌన్: అగ్నిమాపక శాఖలో అసిస్టెంట్ స్టేషన్ ఫైర్ అధికారి కొత్త పోస్టులు సృష్టించాలని అగ్నిమాపక శాఖ ఉద్యోగులు కోరారు. జిల్లాకేంద్రంలోని ఫైర్‌స్టేషన్‌లో జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి కేశవులుకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. లీడింగ్ ఫైర్‌మెన్లకు పదోన్నతులు కల్పించాలన్నారు. అలాగే ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఇందులో రమాకాంత్, కాంతారావు, రమ తదితరులున్నారు.

నేడు, రేపు ప్రత్యేక ఓటరు నమోదు

కైలాస్‌నగర్: ఓటరుగా నమోదు చేసుకునేందుకు యువతకు మరో అవకాశం లభించింది. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 20, 21 తేదీల్లో ఎన్నికల సంఘం ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని చేపడుతుంది. ఇందులో భాగంగా బూత్ లెవల్ అధికారులు జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు వరకు అందుబాటులో ఉండనున్నారు. 1.1.2024 నాటికి 18 ఏళ్లు నిండిన యువత ఫారం–6 ద్వారా ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తోంది. ఫారం–7 ద్వారా మృతుల పేర్లతో పాటు రెండు చోట్ల ఓటు హక్కు కలిగి ఉన్నవారి పేర్లను తొలగించనున్నారు. ఫారం–8 ద్వారా ఓటరు కార్డులో తప్పొప్పుల సవరణలు, దివ్యాంగుల గుర్తింపు, మొబైల్‌నంబర్ నమోదు, కొత్త ఓటర్ గుర్తింపు కార్డు, పోలింగ్ కేంద్రం వంటి వివరాలు మార్చుకోవచ్చని ఆదిలాబాద్ ఆర్డీవో స్రవంతి తెలిపారు. ఓటరు జాబితాలో ఏవైనా సమస్యలుంటే బూత్ లెవల్ అధికారికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 22 తుది గడువని, దరఖాస్తులను బూత్ లెవల్ అధికారికి లేదా తహసీల్దార్/ఆర్డీవో కార్యాలయాల్లో అందజేయవచ్చని పేర్కొన్నారు. అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అయోధ్యకు యశ్వంత్‌రావ్ మహరాజ్



అయోధ్యకు బయలుదేరిన యశ్వంత్‌రావ్ మహరాజ్

ఇంద్రవెల్లి: మండలంలోని సమాక గ్రామానికి చెందిన జంగుబాయి భక్తుడు కోరెంగా యశ్వంత్‌రావ్ మహరాజ్‌కు అయోధ్యలో ఈ నెల 22న బాలరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమానికి ఆహ్వానం అందింది. ఈ మేరకు శుక్రవారం ఆయన గ్రామస్తులతో కలిసి ముత్నూర్ వరకు శోభాయాత్రగా వెళ్లి అక్కడి నుంచి అయోధ్యకు బయలుదేరారు. ముందుగా గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలిండియా వనవాసీ కల్యాణ పరిషత్ ఉపాధ్యక్షుడు కుమ్ర నాగు ఆధ్వర్యంలో అయోధ్యకు బయల్దేరి వెళ్లారు. కార్యక్రమంలో వనవాసీ కల్యాణ పరిషత్ ప్రముఖులు జంగు, గ్రామ పటేల్ భగవంత్‌రావ్ తదితరులున్నారు.

క్లుప్తంగా

గుర్తు తెలియని వృద్ధుడి మృతి



గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం

భైంసా: కాజీపేట రైల్వేస్టేషన్‌లో నాగర్‌సోల్ నుంచి నర్సాపూర్ వెళ్లే రైలులో ప్రయాణిం చిన ఓ గుర్తు తెలియని వృద్ధుడు శుక్రవారం మృతిచెందాడు. ఆ వృద్ధుడు బాసర స్టేషన్‌లో ఈనెల 18న రాజమండ్రి వరకు టికెట్టు తీసు కున్నట్లు రైల్వే పోలీసులు గుర్తించారు. మృత దేహాన్ని గుర్తించిన రైల్వే పోలీసులు బాసర రైల్వే జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ మహ్మద్‌కు సమాచారం ఇచ్చాడు. మృతుడికి సంబంధిం చిన పూర్తి వివరాలు తెలియరాలేదు.

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

భైంసారూరల్: మండలంలోని మహాగాం గ్రామానికి చెందిన పోశెట్టి(38) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై శ్రీకాంత్ వెల్లడించాడు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... పోశెట్టి ప్రైవేటు ఆర్టీసీ బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం మహాగాం – చింతల్‌బోరి గ్రామాల మధ్య చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గత కొంతకాలంగా కుటుంబ కలహాలతో భార్య, పిల్లలకు దూరంగా ఉంటున్నాడు. ఆత్మహత్యకు కుటుంబ కలహాలే కారణమై ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఫిర్యాదు అనంతరం దర్యాప్తు చేసి పూర్తి వివ రాలు వెల్లడిస్తామని తెలిపారు.

వివాహిత ఆత్మహత్యకు కారకులైన ఇద్దరికి జైలు

లక్ష్మణచాంద: వివాహిత ఆత్మహత్యకు కారకు లైన పలువురికి నిర్మల్ జిల్లా కోర్టు ఏడేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు ఒక్కొక్కరికీ రూ.3వేల జరిమానా విధించినట్లు జిల్లా కోర్టుల సమ న్వయ అధికారి సక్రియానాయక్ తెలిపారు. వివరాల ప్రకారం... మండలంలోని రాచా పూర్ గ్రామానికి చెందిన కుంట్ల పరమేశ్వర్, శాంతినగర్ నిర్మల్‌కు చెందిన ఇర్ర కావ్య, అలియాస్ కుంట్ల కావ్య(24), 2014లో నిర్మ ల్‌లోని అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో చేరారు. ఇరువురు మధ్య పరిచయం ప్రేమగా మారడంతో 2019లో వివాహం చేసుకు న్నారు. పెళ్లైన రెండుమూడు నెలల తరువాత రూ.5లక్షల కట్నం తీసుకురావాలని భర్తతో పాటు బావా ఉమామహేశ్వర్ వేధించడంతో 2020లో ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో తండ్రి మంజులారెడ్డి లక్ష్మణచాంద పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. డీఎస్పీ చార్జిషీట్ కోర్టులో దాఖలు చేయగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ కల్వకుంట్ల వినోద్ రావు 18 మందిని సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి నేరం రుజువు చేశాడు. దీంతో నిర్మల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణ కుమార్ నిందితు లకు పైవిధంగా శిక్ష విధించాడు.

మహిళకు గాయాలు

సోన్: ఆటో బోల్తాపడిన సంఘటనలో మహిళ తీవ్రంగా గాయపడింది. పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని న్యూవెల మ్‌ల్ గ్రామానికి చెందిన కొత్తపల్లి సుమలత తిరుపతి దర్శనానికి తన ఇద్దరు పిల్లలు తీసు కుని వెళ్లి తిరిగి వస్తూ నిర్మల్ బస్టాండ్‌కు చేరు కుంది. అక్కడి నుంచి ఆటో కిరాయి తీసుకొని వెళ్తుండగా వెల్మల్ గ్రామ శివారులో డ్రైవర్ అజాగ్రత్తగా నడపడంతో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో సుమలత తీవ్రంగా గాయపడిం ది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సంతోషం రవీందర్ తెలిపారు.

68సార్లు రక్తదానం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని కస్బా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడి గా విధులు నిర్వహిస్తున్న యాటకారి సాయన్న 68సార్లు రక్తదానం చేసి మానవ త్వాన్ని చాటుకున్నాడు. శుక్రవారం లోకేశ్వర్ మండలానికి చెందిన లసుంబాయి అత్యవ సర ఆపరేషన్ కోసం ఎన్టీఆర్ ఆస్పత్రిలో చేర గా బి పాజిటివ్ రక్తం అవసరమని డాక్టర్లు చెప్పారు. దీంతో సాయన్నను సంప్రదించగా ఆస్పత్రికి చేరుకుని రక్తదానం చేశాడు.

ఆహో రామా.. అయోధ్య రామా..

- 22న బాలరాముడి ప్రాణప్రతిష్ఠాపన
- ఉమ్మడి జిల్లాలో ఆధ్యాత్మిక వాతావరణం
- శుభ ఘడియ కోసం నిరీక్షిస్తున్న భక్తజనం
- ఉమ్మడి జిల్లాలోని పలువురికి ఆహ్వానం
- ఇప్పటికే అయోధ్యపురికి భక్తుల పయనం

నెట్‌వర్క్: ఐదు శతాబ్దాల అపురూప స్వప్నం సాకారమవుతోంది. ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో శ్రీరామ విగ్రహ ప్రాణప్రతిష్ఠ మహోత్సవం జరగబోతోంది. యావత్ భారతావని సంబరాల్లో మునిగి తేలే శుభసమయం ఆసన్నమవుతోంది. అయోధ్యలో నిర్మితమైన భవ్యమందిరంలో శ్రీరాముడు ఈ నెల 22వ తేదీన కొలువుదీరబోతున్నాడు. ఈ అపురూప ఘట్టాన్ని ప్రత్యక్షంగా, పరోక్షంగా చూసి తరించేందుకు భక్తజనం ఎదురుచూస్తోంది. ఇప్పటికే రాములోరి అక్షింతలతో శోభాయాత్ర, ఇంటింటా పంపిణీ కార్యక్రమాలతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అంతటా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. అయోధ్యలో రామమందిర నిర్మాణం తలపెట్టాలని ఆనాడు జరిగిన కరసేవలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన పలువురు పాల్గొన్నారు. అలాంటివారితోపాటు మరికొందరికి ప్రాణప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొనేందుకు రావాలని ఆహ్వానం అందింది. దీంతోఈ అపురూప ఘట్టాన్ని ప్రత్యక్షంగా వీక్షించేందుకు వారు ఇప్పటికే అయోధ్యకు వెళ్లారు. ఈనెల 22వ తేదీన అయోధ్యలోని రామమందిరంలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ నేపథ్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావాసులు 'సాక్షి'తో పంచుకున్న అభిప్రాయాలు వారి మాటల్లోనే..





అణువణువునా రామనామమే..



నిర్మల్ ఖిల్లా: నిర్మల్ జిల్లాలో రామజన్మతీర్థ క్షేత్ర ట్రస్ట్ పిలుపుతో ఆర్ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్ లాంటి పలు ఆధ్యాత్మిక సంఘాల సమన్వయంతో రామమందిర నిర్మాణానికి చెందిన నిధి సేకరణ పూర్తి చేశాం. పూజిత అక్షింతల వితరణ కార్యక్రమం విజయవంతం చేశాం. జిల్లా ప్రజలు ఈనెల 22వ తేదీనాటి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా, పరోక్షంగా వీక్షించేందుకు ఎదురుచూస్తున్నారు.

– సాదం అరవింద్, నిర్మల్

మదినిండా ఆనందంతో..



నిర్మల్ ఖిల్లా: వందల ఏళ్ల నాటి చరిత్ర కలిగిన శ్రీరామ చరిత అందరికీ స్ఫూర్తివంతమైనదే. ప్రతీ భక్తుడు కలలుగానే ఆయోధ్యలో ఆలయ నిర్మాణం పూర్తి చేసుకుంది. రాముడి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం వేళ అందరి మదినిండా ఆనందం వెల్లివిరుస్తోంది.

– కిన్నెర్ల రవి, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ సభ్యుడు, నిర్మల్

కల నిజమవుతోంది



నిర్మల్ ఖిల్లా: రద్దీ దృష్ట్యా నిర్మల్ జిల్లా నుంచి అయోధ్య రాముడి దర్శన భాగ్యం కొంతమందికే దక్కింది. ఫిబ్రవరి 19న అయోధ్య దర్శనం కోసం దాదాపు 50 మంది వరకు ఆహ్వానం లభించింది. వెళ్లేందుకు సన్నద్ధమవుతున్నాం. 1990 ప్రాంతంలో కరసేవకులుగా ఇక్కడి నుంచి అనేకసార్లు అయోధ్య వెళ్లాం. ప్రస్తుతం రామ మందిరం కల నెరవేరుతుండటం సంతోషంగా ఉంది.

– మంచిరాల నాగభూషణం, అక్షింతల పంపిణీ సంయోజకుడు, నిర్మల్

పూర్వజన్మ సుకృతం



నిర్మల్ ఖిల్లా: శ్రీరాముడి భక్తుడిగా పలు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొన్నాను. మరో రెండ్రోజుల్లో అయోధ్యలో శ్రీరామ మందిరం ప్రాణప్రతిష్ఠ నిర్వహించనున్నారు. ఈ అద్భుత ఘట్టాన్ని వీక్షించే అదృష్టాన్ని నా పూర్వ జన్మ సుకృతంగా భావిస్తున్నాను.

– గోనెల శశిరాజ్, నిర్మల్

కుభీర్ నుంచి పాదయాత్రగా..

కుభీర్: మండలంలోని కుభీర్ గ్రామానికి చెందిన జాదవ్ మాధవ్ గత నెల 27న అయోధ్యకు వెళ్లేందుకు పాదయాత్ర ప్రారంభించాడు. స్థానిక విఠలేశ్వర మందిరం నుంచి కాలినడకన బయలుదేరాడు. అయోధ్యకు 200 కిలోమీటర్ల దూరంలో ఉన్నట్లు శుక్రవారం తెలిపాడు. ఇప్పటివరకు వెయ్యి కిలోమీటర్ల పాదయాత్ర పూర్తయిందని పేర్కొన్నాడు. రోజుకు 40కిలో మీటర్లకుపైగా నడుస్తున్నట్లు తెలిపాడు. మరో రెండ్రోజుల్లో అయోధ్యకు చేరుకోనున్నట్లు పేర్కొన్నాడు.



పాదయాత్రగా వెళ్తున్న జాదవ్ మాధవ్

సైకిల్‌పై ఉట్నూర్ నుంచి అయోధ్యకు..

ఉట్నూర్‌రూరల్: మండలంలోని వేణునగర్ గ్రామానికి చెందిన జాదవ్‌రాజేశ్వర్, భీమేశ్వర్ అయోధ్య రామాలయ ప్రారంభోత్సవంలో పాల్గొనేందుకు 22రోజుల క్రితం సైకిల్‌పై వెళ్లారు. ఇప్పటికే వారు యూపీ చేరుకున్నట్లు హిందూ ఉత్సవ సమితి సభ్యులు తెలిపారు. ఈ నెల 22న నిర్వహించే రామాలయ ప్రారంభోత్సవంలో పాల్గొననున్నట్లు వారు పేర్కొన్నారు.



ఉట్నూర్ నుంచి బయలుదేరుతున్న యువకులు (ఫైల్)

పిలుపురావడం అదృష్టం



ఇచ్చోడ: అయోధ్యలో రాములోరి విగ్రహప్రతిష్ఠాపనకు పిలుపు రావడం అదృష్టంగా భావిస్తున్నాను. పదిహేనేళ్ల నుంచి గోశాల నిర్వహిస్తూ గోమాతలకు రక్షణ కల్పిస్తున్న. అయోధ్య రామాలయ నిర్మాణం కోసం నావంతుగా 2019లో ఇటుకలను తీసుకుని ఇచ్చోడ నుంచి అయోధ్య వరకు పాదయాత్ర చేశాను. రాముడి విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొనడం గోమాతల ఆశీస్సులే కారణం.

– ఐద రాజేశ్, జైశ్రీరాం గోశాల నిర్వాహకుడు, ఇచ్చోడ

చాలా ఆనందంగా ఉంది



బజార్‌హత్నూర్: మారుమూల ప్రాంతం నుంచి పవిత్రమైన అయోధ్యలోని బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి ఆహ్వానం అందడం చాలా ఆనందంగా ఉంది. గ్రామానికి చెందిన పండరి, నేను గతేడాది బజార్ హత్నూర్ నుంచి అయోధ్య వరకు పాదయాత్ర చేశాం. దీంతో అక్కడి నుంచి మా ఇద్దరికి ఆహ్వానం అందింది. మా సోదరుడు బొజ్జవార్ సంతోష్ 1991లో కరసేవకుడిగా అయోధ్యకు వెళ్లాడు. మాతో పాటు అతడికీ ఆహ్వానం అందింది.

– బొజ్జవార్ వీరనందయ్య, బజార్‌హత్నూర్

పూర్వజన్మ పుణ్యఫలం



ఇచ్చోడ: అయోధ్యలో రాముడి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాన్ని ప్రత్యక్షంగా చూసే భాగ్యం దొరకడం పూర్వజన్మలో చేసుకున్న పుణ్యఫలమే. ఇలాంటి అపురూప ఘట్టం చూసే అవకాశం చాలా తక్కువ మందికే దొరుకుతుంది. అయోధ్యలో రాముడి విగ్రహప్రతిష్ఠాపన రోజు స్వయాన రాముడు మరోసారి ఈనేలపై నడయాడుతున్నట్లుగా ఉంటుంది. అయోధ్యలో రాముడి విగ్రహ ప్రతిష్ఠాపన చరిత్రాత్మకం.

– నారాయణ మహరాజ్, వైష్ణవ సదన్ పీఠాధిపతి, మాదాపూర్

ఆహ్వానం రావడం అదృష్టమే



కడెం: రామమందిర నిర్మాణం, రాముడి కోసం అనేక సందర్భాల్లో ఉద్యమం చేశాం. దాని ఫలితంగా అయోధ్య రామమందిరం నుంచి ఆహ్వానం అందడం నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్న. 30 ఏళ్లుగా ఆర్ఎస్ఎస్, బీజేపీ, భజరంగ్‌దల్ తదితర విభాగాల్లో నిస్వార్థంగా పని చేసిన. నన్ను గుర్తించి ఆహ్వానం పంపడం ఆనందంగా ఉంది. రద్దీ దృష్ట్యా ప్రారంభోత్సవం తర్వాత అయోధ్యకు వెళ్తాం.

– అమరవేణి రవీందర్‌గౌడ్, కడెం

సంతోషాన్ని మాటల్లో చెప్పలేను



ఆసిఫాబాద్‌అర్బన్: ఈనెల 22వ తేదీన అయోధ్యలో రామమందిరం ప్రారంభమవుతున్నందున సంతోషాన్ని మాటల్లో చెప్పలేను. కరసేవకు వెళ్తున్న సమయంలో బీజేపీ అగ్రనేత ఎల్కే అద్వాని సూచన మేరకు ప్రయాణాన్ని సాగించాం. డిసెంబర్ 6వ తేదీకి అయోధ్యకు చేరుకోలేకపోయామన్న బాధ ఇప్పటికీ వేధిస్తోంది. 14 రోజుల జైలు అనంతరం అయోధ్యకు వెళ్లి రామచంద్రుడిని దర్శించుకోవడంతో నా జన్మ ధన్యమైంది. దేశంలో రామరాజ్య స్థాపన ప్రారంభమవుతుండడంతో ప్రజలు సుఖఃసంతోషాలతో జీవిస్తారు.

– సుబ్బా తిరుమల్, కరసేవకుడు, ఆసిఫాబాద్

జన్మ ధన్యమైంది



ఆసిఫాబాద్‌అర్బన్: అయోధ్యలో శ్రీరామచంద్ర ఆలయ ప్రారంభోత్సవాన్ని చూడబోతున్నందుకు నా జన్మ ధన్యమైంది. 1992లో నేను కరసేవకు ఆసిఫాబాద్ నుంచి 15మందితో కలిసి అయోధ్యకు వెళ్లాను. మార్గంమధ్యలో పోలీసులు అరెస్ట్ చేసి అలహాబాద్‌లోని జైలులో 16 రోజులు ఉంచారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో కరసేవకు వెళ్తున్న మార్గంలో అనేక మంది సహాయ, సహకారాలు జీవితంలో మరువలేను. కరసేవలో ఎన్ని కష్టాలు ఎదురైనా సంతోషంగా స్వీకరించాం. ఈ జన్మకు నా జీవితంలో ఇంతకంటే ముఖ్యమైన ఘట్టం ఏదీలేదు.

– దండనాయకుల చంద్రకాంత్, కరసేవకుడు, ఆసిఫాబాద్

ఏళ్ల కల నెరవేరింది



ఆసిఫాబాద్‌అర్బన్: ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న అయోధ్యలోని రామాలయ ప్రారంభ కల నెరవేరింది. కరసేవకులుగా బయలుదేరుతున్న సమయంలో నా వయస్సు 20 ఏళ్లే. మా నాన్న ప్రోత్సాహంతో ధైర్యంగా కరసేవకు వెళ్లాను. పోలీసులు అరెస్ట్ చేసి నైనీ జైలులో 14 రోజులు పెట్టారు. అడుగడుగునా పోలీసులు లాటీచార్జి చేయగా గాయాలయ్యాయి. వారం రోజులు ఆహారం దొరకక నీళ్లు తాగి గడిపాం. ఎన్ని ఆటంకాలు ఎదురైనా అయోధ్యకు చేరుకున్నాం. 22వ తేదీన ఆలయం ప్రారంభమవుతున్నందున దేశ వ్యాప్తంగా ఉన్న ఆలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలి. ప్రతీ ఇంట్లో ఐదు దీపాలు వెలిగించాలి.

– కొడిపాక వేణుగోపాల్, కరసేవకుడు, ఆసిఫాబాద్

దేదీప్యమానంగా వెలగాలి

ఆదిలాబాద్: శ్రీరామ జన్మభూమి అయోధ్యలో జరగనున్న బాల రాముడి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి ఆహ్వానం అందింది. శ్రీరామ, హనుమత్ భక్తులు, హిందూ ధర్మ పరిరక్షకుల ప్రతినిధిగా అయోధ్య శ్రీరామ మందిర ప్రారంభోత్సవం, శ్రీరామ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి వెళ్తున్నాను. జనవరి 22 కన్నా ముందే ఆలయంలో నిర్వహించే పలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు, క్రతువుల్లో పాలుపంచుకుంటాను. విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం రోజున ప్రతి ఒక్కరూ తమ తమ నివాసాల్లో దీపాలు వెలిగించి దీపావళి మహోత్సవంలా జరుపుకోవాలి. ప్రతీ ఇల్లు దీప కాంతులతో దేదీప్యమానంగా వెలగాలి.

– యోగానంద సరస్వతి స్వామి



అయోధ్యకు బయలుదేరుతున్న స్వామి

చాలా సంతోషంగా ఉంది



ఇంద్రవెల్లి: నాకు అయోధ్యలో రాములోరి విగ్రహ ప్రాణప్రతిష్ఠకు ఆహ్వానం రావడం చాలా సంతోషంగా ఉంది. అయోధ్యలోని పుణ్యభూమిపై అడుగుపెట్టే అవకాశం రావడం ఆ రాముడి దయగా భావిస్తున్న. దేవగిరి నుంచి నాకు ఆహ్వానం రావడానికి కారణమైన నా గురువు సురేశ్ మహరాజ్‌కు రుణపడి ఉంటా. ఈ నెల 17న ఆదిలాబాద్ నుంచి బయల్దేరి అయోధ్యకు చేరుకున్న.

– జైస్వాల్ శివకుమార్, ముత్నూర్

అదృష్టంగా భావిస్తున్న



ఇంద్రవెల్లి: ఏమాయికుంట కాలుబాబా ఆలయ మహరాజ్‌గా ఉన్న నేను విశ్వహిందూ పరిషత్ మహారాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పని చేస్తున్న. మొదటి నుంచే ఆధ్యాత్మిక మార్గంలో ఉంటూ కాలుబాబా భక్తుడినయ్యా. శ్రీరాముడి సేవామార్గంలో ఉంటూ భక్తులకు మార్గనిర్దేశం చేస్తున్న. నాకు దేవగిరి నుంచి రాముడి ప్రాణప్రతిష్ఠాపన కార్యక్రమానికి రావాలని ఆహ్వానపత్రం రావడం అదృష్టంగా భావిస్తున్న.

– సురేశ్‌మహరాజ్

ఆశీర్వాదం తీసుకుంటా



ఇంద్రవెల్లి: అయోధ్య రాములోరి జన్మభూమిపై అడుగుపెట్టే అవకాశం రావడం చాలా సంతోషంగా ఉంది. నా జన్మ ధన్యమైందని భావిస్తున్న. భారత దేశ పుణ్యభూమిలో ప్రజలను సుఖఃసంతోషాలతో ఉంచాలని వేడుకుంటా. నా తోటి ప్రజల కోసం అయోధ్య రాముడి ద్వారా ఆశీర్వాదం తీసుకుంటా.

– కోరెంగా యశ్వంత్‌రావ్

డిగ్రీ విద్యార్థుల సాహితీ ప్రకల్పన

- రచయితల చెంతకు విద్యార్థులు
- ప్రాజెక్టు పద్ధతిలో భాగంగా అధ్యయనం

నిర్మల్‌ఖిల్లా: నిర్మల్ జిల్లా కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని తెలుగు విభాగంలోని అధ్యాపకులు విద్యార్థుల్లో పరిశోధన నైపుణ్యాలు పెంపొందించి సాహితి జిజ్ఞాసను ఏర్పరచడానికి పలు అంశాలపై అధ్యయన ప్రాజెక్టులను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా తెలుగు విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్ టి.నరసయ్య పర్యవేక్షణలో డిగ్రీ విద్యార్థులు ''కథా సంపుటి- పరిశీలన'' అనే అంశంపై 'నా నుంచి మన వరకు' అనే గ్రంథంలోని కథాంశాలను అధ్యయనం చేస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం నవలకర్త, సాహితీవేత్త, తెలుగు పరిశోధకులు డాక్టర్ టి. సంపత్ కుమార్‌ను కలిసి పలు సాహితీ అంశాలు, రచనల పట్ల సందేహాలను అడిగి తెలుసుకున్నారు. వివరించిన అంశాలను విద్యార్థులు నివేదిక రూపంలో తయారు చేశారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ ప్రొఫెసర్ నర్సయ్య మాట్లాడుతూ.. డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ భీమారావు ప్రోత్సాహంతో డిగ్రీ విద్యార్థుల్లో భాషా విషయాలు, సాహిత్యం వంటి పలు అంశాల పట్ల విద్యార్థుల్లో అభిరుచిని పెంపొందించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఈ క్రమంలోనే అధ్యయన ప్రాజెక్టు పద్ధతిని ఉన్నత విద్యలో 2016 నుండి ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ప్రతి విద్యార్థి మాతృభాష అయిన తెలుగుపట్ల మక్కువ ఏర్పరుచుకోవాలని సూచించారు. ఈ ప్రాజెక్టు అధ్యయనంలో విద్యార్థులు నవ్య, యమున, రఘు పాల్గొన్నారు.



నవలకర్తతో అసిస్టెంట్ ప్రొఫెసర్, డిగ్రీ విద్యార్థులు

మూడోరోజు అదేజోరు..



కుస్తీలో తలబడుతున్న విద్యార్థినులు



క్రీడాకారులకు మెడల్స్ అందిస్తున్న అధికారులు

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని కేబీ ప్రాంగణంలో ప్రారంభమైన 7వ ఇంటర్ సొసైటీ స్పోర్ట్స్ లీగ్ క్రీడా పోటీలు మూడోరోజు క్రీడాకారులు అదే జోరు కొనసాగించారు.. శుక్రవారం బాక్సింగ్, కుస్తీ, కబడ్డీ, ఖోఖో, లాంగ్‌జంప్, హైజంప్ తదితర పోటీలు నిర్వహించారు. అండర్–17 విభాగంలో 1500 మీటర్ల పరుగు పందెంలో డి.సంతోశ్ (సోషల్ వెల్ఫర్ సొసైటీ) గోల్డ్ మెడల్, డిస్కస్‌త్రోలో రామకృష్ణ (జ్యోతిబాపులే సొసైటీ) గోల్డ్ మెడల్, అండర్–19 విభాగం పరుగు పందెంలో నెనావత్ ధోని (ట్రైబల్ వెల్ఫర్ సొసైటీ) గోల్డ్ మెడల్, హైజంప్‌లో వెంకటేశ్‌రావు (స్టార్ సొసైటీ) భద్రచలం గోల్డ్ మెడల్, అండర్ –17 బాలికల విభాగంలో 1500 రన్నింగ్‌లో ఎం.దివ్యశ్రీ (స్టార్స్ సొసైటీ) హైదరాబాద్ గోల్డ్ మెడల్, లాంగ్ జంప్ విభాగంలో పి.నికిత (సోషల్ వెల్ఫర్ సొసైటీ) గోల్డ్ మెడల్ ఇలా పలు క్రీడల్లో విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. విజేతలకు ఐటీడీఏ డీడీ దిలీప్‌కుమార్, ఆయా సొసైటీల క్రీడాధికారులు మెడల్స్, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నారు.



కబడ్డీ ఆడుతున్న విద్యార్థినులు

కేంద్ర పథకాలను వినియోగించుకోవాలి

- ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు

నేరడిగొండ: గ్రామీణ ప్రజల ముంగిట్లోకి కేంద్ర ప్రభుత్వ పథకాలు తీసుకెళ్తున్నట్లు ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు అన్నారు. మండలంలోని నాగమల్యాల్ గ్రామంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. నాగమల్యాల్ గ్రామంలో మాట్లాడారు. క్యాలెండర్‌పై ఉన్న క్యూఆర్ కోడ్‌ను సెల్‌ఫోన్ ద్వారా స్కాన్ చేస్తే కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్నీ తెలుస్తాయన్నారు. అనంతరం జిల్లా కోఆర్డినేటర్ గొల్ల రాజు యాదవ్, దక్షిణ మధ్య రైల్వే బోర్డు మెంబర్ జీవి రమణ, మండల నోడల్ అధికారి, టీజీబీ మేనేజర్ చంద్రశేఖర్, మండల ఆరోగ్య పర్యవేక్షకులు హరికుమార్‌గౌడ్ మాట్లాడారు. కరపత్రాలు, క్యాలెండర్లను ఆవిష్కరించారు. సర్పంచ్ భీముడు, ఆ పార్టీ మండల కన్వీనర్ సోసయ్య హీరాసింగ్, నాయకులు శంకర్, ప్రశాంత్ ఉన్నారు.

గుడిహత్నూర్: బీజేపీ పాలనలోనే దేశం అభివృద్ధి చెందిందని, కేంద్ర ప్రభుత్వం చేపట్టిన భారత్ సంకల్ప్ వికసిత్ యాత్ర ప్రాధాన్యతను తెలుసుకోవాలని ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు అన్నారు. మండలంలోని సీతాగోందిలో మాట్లాడారు. జెడ్పీటీసీ పతంగె బ్రహ్మానంద్, రైల్వే బోర్డు సభ్యుడు జీవీ రమణ, ఏవో రేవతి ఉన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంపీ సోయం బాపూరావు

హ్యుందాయ్ కొత్త క్రెటా ఆవిష్కరణ

నిర్మల్: హ్యుందాయ్ మోటార్స్ ఇండియా కొత్త క్రెటా కారును మార్కెట్‌లోకి తీసుకువచ్చింది. ఈ మేరకు జిల్లా కేంద్రం శివారులోని ఎల్లపల్లిలోని ప్రకాష్ హ్యుందాయ్ షో రూంలో శుక్రవారం ఈ కొత్త కారును ఆవిష్కరించారు. జిల్లా రవాణాశాఖ అధికారి అజయ్‌కుమార్‌రెడ్డి, షోరూం సీఈఓ నల్ల ప్రతిహాస్‌రెడ్డి ఈ కారును విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ కస్టమర్ల మన్ననలు పొందిన క్రెటా కారును సరికొత్తగా అత్యాధునిక టెక్నాలజీని పొందుపరుస్తూ తీసుకువచ్చినట్లు వివరించారు. డైనమిక్ ఎస్‌యూవీ క్వాడ్ బీమ్ ఎల్ఈడీ హెడ్‌ల్యాంప్‌లు, హ్యుందాయ్ స్మార్ట్‌సెన్స్ లెవల్–2 ఏడీఏ వంటి ఫీచర్లు ఉన్న 'సెన్స్యుయస్ స్పోర్టినెస్' డిజైన్ లాంగ్వేజ్ ఉందన్నారు. కార్యక్రమంలో షోరూం మేనేజర్ యశ్వంత్‌రెడ్డి పాల్గొన్నారు.



కారును ఆవిష్కరిస్తున్న డీటీవో తదితరులు